క్లుప్తంగా

నేడు మహాలక్ష్మి అమ్మవారి పండగ


నిర్మాణంలో అమ్మవారి ఆలయం

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని ఎం.జగన్నాథపురం గ్రామంలో ఈ నెల 6వ తేదీన మహాలక్ష్మి అమ్మవారి పండగను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు నిర్వాహకులు కర్రి వెంకట స్వామి నాయుడు తెలిపారు. ఈ మేరకు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. పండగను పురస్కరించుకొని గ్రామంలో కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నారు. మధ్యాహ్నం సారె ఊరేగింపు నిర్వహించనున్నారు.

సమస్యలపై వివరాలు అందించండి

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని మల్లవరం గ్రామంలో సర్పంచ్ పిన్నంరాజు వాసు బుధవారం ఇంటింటికీ వెళ్లి సమస్యలపై ఆరా తీశారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్కరికీ కావాల్సిన ధ్రువీకరణ పత్రాలను అందజేస్తారని, వలంటీర్లకు పూర్తి వివరాలను అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చందక శివ పాల్గొన్నారు.

నేడు చినదొడ్డిగల్లు సత్తమ్మతల్లి పండగ


సత్తమ్మతల్లి

నక్కపల్లి : మండలంలో ప్రసిద్ధిగాంచిన చిన దొడ్డిగల్లు సత్తమ్మతల్లి పండగను గురువారం అత్యంత ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. గ్రామానికి చెందిన చింతలపాటివారి కుటుంబీకుల ఆరాధ్య దైవమైన సత్తమ్మతల్లి పండగను ప్రతి ఏటా ఆషాఢ పౌర్ణమి తర్వాత వచ్చే గురువారం ఘనంగా నిర్వహిస్తామని ఆలయ ధర్మకర్త రాజబాబు తెలిపారు. నక్కపల్లి మండల నలుమూలల నుంచే కాకుండా పాయకరావుపేట, తుని, యలమంచిలి, అనకాపల్లి, అడ్డురోడ్డు ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని కానుకలు, మొక్కుబడులు సమర్పించుకునేందుకు తరలి వస్తారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద తిరునాళ్లు జరుగుతుంది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు విస్తృత బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

నేడు రెండు గ్రామాల్లో జగనన్న సురక్ష

మునగపాక : మండలంలోని పల్లపు ఆనందపురం, తిమ్మరాజుపేట గ్రామాల్లో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీవో మన్మథరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ధ్రువీకరణ పత్రాలు అందజేస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సీజన్‌లో ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి


వాడ్రాపల్లిలో వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

మునగపాక : సీజన్‌లో ప్రతి ఒక్కరూ ఆరోగ్య సూత్రాలు పాటించాలని వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు కోరారు. గ్రామంలో బుధవారం ఏర్పాటు చేసిన 104 వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా నూకరాజు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. ఎటువంటి అనారోగ్యం సంభవించినా నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలన్నారు. కాగా శిబిరానికి వచ్చిన రోగులను వైద్యాధికారి ప్రవళిక వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

యలమంచిలి : నేడు విద్యుత్ మరమ్మతుల కారణంగా యలమంచిలి మండలంలో పీఎన్ఆర్‌పేట, బయ్యవరం, పురుషోత్తపురం, పోతిరెడ్డిపాలెం, రుక్మిణీపురం, రేగుపాలెం, లైనుకొత్తూరు గ్రామాలకు గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు విద్యుత్‌కు అంతరాయం ఏర్పడనున్నదని విద్యుత్ శాఖ ఏఈ కె.రాజశేఖర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

గ్రామ స్వరాజ్యమే ముఖ్యమంత్రి ధ్యేయం


లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బ్రోచర్లను అందిస్తున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు


అర్జీదారులకు ధ్రువపత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

పాయకరావుపేట : రాష్ట్రంలో గ్రామాల అభివృద్ధి చేయడమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని, గ్రామ స్వరాజ్యమే ముఖ్యమంత్రి లక్ష్యమని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. మండలంలో గల సీతారాంపురం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలైన అమ్మ ఒడి, పింఛను, రైతుభరోసా, విద్యాదీవెన, వసతి దీవెన, పొదుపు సంఘాలకు సున్నా వడ్డీ తదితర పథకాలు పొందుతున్న ప్రజలను అడిగి తెల్సుకున్నారు. ప్రభుత్వం అర్హులందరికీ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. ప్రతి ఒక్కరికీ సొంతింటి కల నేరవేర్చడం కోసం అర్హులందరికీ ఇళ్ళ స్థలాలు కేటాయించి, ఇంటి నిర్మాణానికి రుణాలు మంజూరు చేస్తుందన్నారు. ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించడమే ముఖ్యమంత్రి ధ్యేయమన్నారు. గ్రామంలో మౌలిక వసతుల కల్పనపై అధికారులను అడిగి తెల్సుకున్నారు. తాగునీరు, పాఠశాలలు అభివృద్ధిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల విద్యార్థులను జగనన్న గోరుముద్ద గురించి, జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరికీ కూడా ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న, కల్పిస్తున్న, చేస్తున్న అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని రానున్న ఎన్నికల్లో కూడా జగన్‌మోహన్‌రెడ్డికే అందరం మద్దతు పలకాలన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరలా మనందరం జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేసుకోవాలన్నారు. అనంతరం సంక్షేమ పథకాలతో ముద్రించిన బ్రోచర్‌లను గ్రామస్తులకు, లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు, ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, జెడ్పీటీసీ లంక సూరిబాబు, పార్టీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, ఏఎంసీ వైస్ చైర్మన్ గూటూరు శ్రీనివాసరావు, పార్టీ మండల అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు, వైస్ ఎంపీపీ ధనిశెట్టి మాధవి తిరుమల్లేశ్వరరావు, పాయకరావుపేట పీఏసీఎస్ చైర్మన్ దేవవరపు రాజేష్ ఖన్నా, పాయకరావుపేట గ్రామ సర్పంచ్ గారా ఉష శ్రీప్రసాద్, ఉప సర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, మండల తహసీల్దార్ కె.జయప్రకాష్, ఎంపీడీవో ఎ.సాంబశివరావు, పార్టీ సీనియర్ నాయకులు దేవవరపు సూర్యచక్రం, నామవరం పీఏసీఎస్ చైర్మన్ కె.సుందరలత, నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ కొంకిపూడి రామకృష్ణ, మండల బీసీ సెల్ అధ్యక్షుడు పక్కుర్తి లోవకుమార్, ఆయా మండల శాఖ అధికారులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష...సంక్షేమ రక్ష

పాయకరావుపేట : సంక్షేమ పథకాల కోసం ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా ప్రజల చెంతకే సేవలు అందించడానికి జగనన్న సురక్ష కార్యక్రమాలు ఏర్పాటు చేశారని ఎమ్మెల్యే బాబూరావు అన్నారు. పట్టణంలో గల మూడో నంబరు సచివాలయంలో బుధవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. సచివాలయ పరిధిలో 476 అర్జీలకుగాను అధిక సంఖ్యలో అర్జీలను పరిష్కరించి, అర్హులైన వారికి ఎమ్మెల్యే గొల్ల బాబూరావు చేతుల మీదుగా ధ్రువ పత్రాలు పంపిణీ చేశారు. గుంటపల్లి గ్రామంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో 314 అర్జీలకు గాను అర్హులకు విచారణ చేసి ధ్రువ పత్రాలు అందించారు. ఎంపీడీవో ఎ.సాంబశివరావు బృందం నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ గెడ్డం సుజాత, జెడ్పీటీసీ లంక సూరిబాబు చేతుల మీదుగా అర్హులైనవారికి సంక్షేమ పథకాల ధ్రువపత్రాలు అందించారు. ఎంపీటీసీ పల్యేల రామలక్ష్మి లక్ష్మణరావు, డీటీ కె.నూకరాజు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం


మునగపాకలో సచివాలయం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు, పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ

మునగపాక : సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆదర్శంగా నిలిచారని ఎమ్మెల్యే యు.వి. రమణమూర్తిరాజు(కన్నబాబు) అన్నారు. ఆయన ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ నేడు ప్రజలకు మెరుగైన సేవలందిస్తుందన్నారు. మునగపాకలో రూ.80 లక్షలకు పైగా వ్యయంతో నిర్మించిన రెండు సచివాలయాలను ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రమణమూర్తిరాజు మాట్లాడుతూ గ్రామాల్లో సచివాలయ వ్యవస్థ అందుబాటులోకి వచ్చాక ప్రజలకు సకాలంలో సేవలందుతున్నాయన్నారు. గత టీడీపీ హయాంలో కార్యాలయాల చుట్టూ తిరిగేవారని నేడు అటువంటి పరిస్థితులు లేవన్నారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థలు ద్వారా ప్రజల వద్దకే సేవలందుతున్నాయన్నారు. ఎక్కడ చూసినా సంక్షేమం, అభివృద్ధి జరుగుతుంటే ప్రతిపక్షాలు ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఆరోపణలు చేయడం విచారకరమన్నారు. చంద్రబాబు నాయుడుకు ఇవే ఆఖరి ఎన్నికలన్నారు.

జగన్‌మోహన్‌రెడ్డికి మరోసారి అవకాశం ఇవ్వాలని తద్వారా మరిన్ని సంక్షేమ పథకాలు దక్కుతాయన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం నేడు జగన్‌మోహన్‌రెడ్డి వల్ల సాధ్యమవుతుందన్నారు. ప్రజలకు 11రకాల సేవలకు సంబంధించి ఉద్యోగులు అందుబాటులో ఉంటూ నిరంతరం సేవలందిస్తున్నారన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ జెండాలు రెపరెపలాడడం ఖాయమని మరలా జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావడం తథ్యమన్నారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాల ద్వారా అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. మునగపాక ఎంపీటీసీ సూరిశెట్టి రాము అధ్యక్షతన జరిగిన సమావేశంలో సర్పంచ్ దిమ్మల అప్పారావు, పార్టీ మండల కన్వీనర్ అచ్చియ్యనాయుడు, ఎంపీపీ జయలక్ష్మి, జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, సచివాలయాల మండల కన్వీనర్ పొలిమేర గణేష్, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి రామ్మోహనరావు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పిల్లి కనకలక్ష్మి అప్పారావు, మునగపాక-3 ఎంపీటీసీ గణేష్, వైస్ ఎంపీపీ బోజా లక్ష్మీ శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ సత్యనారాయణ, సచివాలయ కన్వీనర్ అప్పలనాయుడు, మహేష్, ఎంపీడీవో మన్మథరావు, తహసీల్దార్ ప్రకాశరావు పాల్గొన్నారు.

సంక్షేమం ఒక ఉద్యమంలా...

- పారదర్శకంగా జగనన్న పాలన
- ఎమ్మెల్యే రమణమూర్తిరాజు
- సోమలింగపాలెంలో జగనన్న సురక్ష కార్యక్రమం


సోమలింగపాలెంలో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేసిన ఎమ్మెల్యే రమణమూర్తిరాజు, మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి

యలమంచిలి : రాష్ట్రంలో సంక్షేమం ఒక ఉద్యమంలా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన కొనసాగుతోందని యలమంచిలి ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు (కన్నబాబు) అన్నారు. బుధవారం యలమంచిలి పట్టణంలో సోమలింగపాలెం గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులకు వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను మున్సిపల్ చైర్మన్ పిల్లా రమాకుమారి, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార్‌వర్మ, పట్టణ సచివాలయ కన్వీనర్ కర్రి శివశంకర్‌తో కలసి అందజేశారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే రమణమూర్తిరాజు మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని రాష్ట్రంలో చాలా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామని అన్నారు. గ్రామాల్లో వార్డుల్లో గడప గడపకు మన ప్రభుత్వంలో ఇంకా అపరిష్కృతంగా మిగిలిన సమస్యలు ఇక్కడ పరిష్కారం అవుతాయన్నారు. అర్జీదారులకు 11 రకాల ధ్రువీకరణ పత్రాలను ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. మున్సిపాలిటీలో ఇప్పటి వరకు సోమలింగపాలెం గ్రామంలోనే అధిక అర్జీలు వచ్చాయని, సోమలింగపాలెం గ్రామంలో 593 మంది జగనన్న సురక్షలో దరఖాస్తులు పెట్టుకున్నారని, వలంటీర్లు ప్రతి ఇంటికి వెళ్లి సమస్యలు నేరుగా తెలుసుకున్నారని, చాలా బాధ్యతగా పనిచేశారని చెబుతూ శభాష్ అని అభినందించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి మాట్లాడుతూ యలమంచిలి మున్సిపాలిటీలో సోమలింగపాలెంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశామని, జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకుని కావలసిన ధ్రువీకరణ పత్రాలు పొందాలని అన్నారు. యలమంచిలి పట్టణ సచివాలయ కన్వీనర్ శివశంకర్, వార్డు కౌన్సిలర్ కర్రి లక్ష్మి, తహశీల్దారు రాణీ అమ్మాజీ, మున్సిపల్ కమిషనర్ వీరయ్య, శానిటరి ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు, టీపీవో శ్రీలక్ష్మి, స్థానిక వైయస్సార్‌సీపీ నాయకులు గోవింద అయ్యలునాయుడు, గోపి పాల్గొన్నారు.

రాంబిల్లి: జగనన్న సురక్ష కార్యక్రమంతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని ఎమ్మెల్యే రమణమూర్తిరాజు(కన్నబాబు) అన్నారు. గోకివాడ, పంచదార్ల గ్రామాల్లో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యం తీసుకువచ్చి గ్రామాల్లోనే ప్రభుత్వ సేవలందించిన ఘనత జననేత జగనన్నకే దక్కుతుందన్నారు. దేశంలో ఎక్కడా లేని సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న జగనన్నకు అండగా నిలిచి రానున్న ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని కోరారు. సుకుమారవర్మ, తహసీల్దార్ భాగ్యవతి, ఎంపీడీవో కొండలరావు, ఎంపీపీ శిరీషశ్రీనుబాబు, జెడ్పీటీసీ నాగరాజు నాగరాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కిషోర్, మండల సచివాలయ కన్వీనర్ రామకృష్ణ, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సూర్యనారాయణ పాల్గొన్నారు.

కుమారపురం పాలసంఘ అధ్యక్షునిగా మధుబాబు


దోసపాత్రుని మధుబాబు

మునగపాక: మండలంలోని పల్లపు ఆనందపురం శివారు కుమారపురం పాలసంఘ అధ్యక్షునిగా దోసపాత్రుని మధుబాబు ఎన్నికయ్యారు. బుధవారం నిర్వహించిన ఎన్నికల్లో రైతులు మధుబాబును సంఘ అధ్యక్షునిగా ఎన్నుకున్నట్టు డెయిరీ సిబ్బంది తెలిపారు. రెండేళ్ల పాటు ఈ పాలకవర్గం పనిచేస్తుందన్నారు.

ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణం వెంటనే చేపట్టాలి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలో ఈఎస్ఐ 100 పడకల ఆస్పత్రిని వెంటనే నిర్మించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.రాము డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఫార్మాసిటీలోనూ, అచ్యుతాపురం సెజ్‌లో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని, వీరికి తక్షణ వైద్య సేవల నిమిత్తం ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణం అవసరమని వారు పేర్కొన్నారు. ఈ సమావేశంలో రాజాన సత్తిబాబు, రుత్తల గోవింద, ముత్యకర్ల రమణ పాల్గొన్నారు.

గ్రామాల్లోనే సమస్యల పరిష్కారం


దేవవరంలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న దృశ్యం

నక్కపల్లి : జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా గ్రామాల్లోనే సమస్యలను పరిష్కరించే కార్యక్రమం జరుగుతోందని ఆంధ్రప్రదేశ్ పట్టణ ఆర్థిక మౌలిక సదుపాయాల సంస్థ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, జెడ్పీటీసీ కాసులమ్మ అన్నారు. బుధవారం దేవవరం, చందనాడ గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిపాలనలో జగనన్న నూతన సంస్కరణలు తీసుకువచ్చారన్నారు. వివిధ ధ్రువపత్రాలను గతంలో రోజుల తరబడి మండల కార్యాలయాల చుట్టూ తిరిగితేనే కానీ ఇచ్చే వారు కాదని, ఇపుడు జగనన్న సురక్ష ద్వారా గంటల వ్యవధిలోనే ధ్రువపత్రాలు మంజూరవుతున్నాయన్నారు. సంక్షేమ కార్యక్రమాలు కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో మళ్లీ జగనన్నను సీఎంను చేసుకోవాలన్నారు. ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ మండల ప్రత్యేకాధికారి త్రినాథరావు, సర్పంచ్‌లు రాఘవకుమారి, నర్సింహమూర్తి, తళ్ల భార్గవ్, ఎంపీటీసీ తిరుపతిరావు, వైస్ ఎంపీపీ ఈశ్వరరావు, ఎంపీడీవో సీతారామరాజు, తహసీల్దార్ అంబేద్కర్, డీసీఎంఎస్ మాజీ ఉపాధ్యక్షుడు మణిరాజు, మండల పార్టీ అధ్యక్షుడు పాపారావు, మాజీ వైస్ ఎంపీపీ నర్సింహమూర్తి, ఉప సర్పంచ్ వేగేశ్న చంటి, ఒడ్డిమెట్ట దేవస్థానం మాజీ చైర్మన్ దండు బలరామరాజు, డీటీ నీరజ, ఈవోపీఆర్‌డీ వెంకటనారాయణ, కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

892 మందికి ధ్రువపత్రాల జారీ

కోటవురట్ల : జగనన్న సురక్షతో అన్ని సమస్యలకు పరిష్కారం దొరుకుతోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి, వైస్ ఎంపీపీ సీతారామరాజు అన్నారు. పందూరు, లింగాపురం గ్రామాలలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో పాల్గొన్న ఆయన లబ్ధిదారులకు ధ్రువపత్రాలను అందజేసి మాట్లాడారు. ఎటువంటి సర్టిఫికెట్ కావాలన్నా ఒక్క రోజులో ఒక్క పైసా చెల్లించకుండా అదే గ్రామంలో అందిస్తున్నారన్నారు. పందూరులో 985 దరఖాస్తులకు టోకెన్ జనరేట్ చేయగా 912 దరఖాస్తులు ఆన్‌లైన్ చేశారు. ఇందులో 892 దరఖాస్తులకు ధ్రువ పత్రాలు అందజేశారు. మిగిలిన 20 దరఖాస్తులు లేట్ బర్త్‌కు సంబంధించినవి కావడంతో ఆర్డీవో ఆమోదించవలసి ఉందని తహసీల్దారు జానకమ్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకాధికారి ఉదయశ్రీ, సర్పంచ్ చీకట్ల జగదీష్, వైఎస్సార్ సీపీ నాయకుడు చీకట్ల వెంకట్, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వెదురువాడలో వరి విత్తనాల పంపిణీ


వెదురువాడ రైతు భరోసా కేంద్రం వద్ద వరి విత్తనాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి) : అచ్యుతాపురం మండలంలోని వెదురువాడ సచివాలయంలో బుధవారం ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన వరి విత్తనాలను పంపిణీ చేశారు. విత్తనాలను కావాల్సిన రైతులు రైతు భరోసా కేంద్రాల్లో ఆధార్ నంబర్, ఫోన్ నంబర్‌ను నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి బి. శంకర్‌గోవింద్ సూచించారు. రైతులు విత్తనాలు నాటేటప్పుడు విత్తన శుద్ధి చేసుకోవాలని, తద్వారా విత్తనం నాటిన నెల రోజుల వరకూ పొడ తెగులు, అగ్గితెగులు సోకవని తెలిపారు. వ్యవసాయ విస్తరణ అధికారి కె.బి సూర్యనారాయణ, వ్యవసాయ సహాయకులు జాస్మిన్, మాజీ ఎంపీపీ చేకూరి శ్రీనివాసరాజు, గొర్లె నూకరాజు, మైనర్ రాజు, సీరా శ్రీనివాసరావు, ఎం.రాహుల్, రమణ, మధు రాజు పాల్గొన్నారు.

రైతులకు కొండంత భరోసా


చినబొడ్డేపల్లిలో రైతులకు వరి విత్తనాలు అందజేస్తున్న సర్పంచ్ శివరామ్

కోటవురట్ల: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రైతుకు సాగుపై భరోసా కల్పించారని సర్పంచ్ పైల శివరామ్ అన్నారు. ఆర్బీకేలో బుధవారం విత్తన పంపిణీ నిర్వహించారు. ముందుగా రిజిస్టర్ చేసుకున్న రైతులకు సర్పంచ్ శివరామ్ చేతుల మీదుగా అందజేశారు. సర్పంచ్ మాట్లాడుతూ గతంలో వరి విత్తనాల కోసం రైతులు ఎన్నో పాట్లు పడేవారన్నారు. విత్తనాలు దొరకని పరిస్థితుల్లో సాగుకు దూరమయ్యేవారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక నాలుగేళ్లుగా రైతును ప్రోత్సహిస్తూ అనేక విధాలుగా ఆసరా కల్పిస్తున్నారన్నారు. వరి విత్తనాలు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉన్నాయని, కావలసిన రైతులు ఆర్బీకేలో సంప్రదించాలన్నారు.

'బీజేపీకి కొత్త ఊపిరి'

పాయకరావుపేట: బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలిగా దగ్గుబాటి పురందేశ్వరిని నియమించడం అభినందనీయమని, ఆమె నాయకత్వంలో పార్టీ బలోపేతమవుతుందని పార్టీ నాయకుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేష్ అన్నారు. ఆయన బుధవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. మాజీ సీఎం కిరణ్ కుమార్‌రెడ్డిని పార్టీలో చేర్చుకోవడం, జనసేన పార్టీతో పొత్తు ఉంటుందని ప్రకటించడం వలన పార్టీ బలపడుతుందన్నారు. బీజేపీని దూరం చేసుకున్నందునే టీడీపీ దౌర్భాగ్య స్థితికి చేరుకుందన్నారు.

బొజ్జన్నకొండ అభివృద్ధికి వినతి

తుమ్మపాల: బొజ్జన్న కొండ అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రూ.15 కోట్ల నిధుల విడుదల పట్ల హర్షం వ్యక్తం చేస్తూ సిద్ధార్థ సోషల్ వెల్ఫేర్ సంఘ అధ్యక్షుడు బల్లా నాగభూషణం ఎంపీ భీశెట్టి సత్యవతికి కృతజ్ఞతలు తెలిపారు. పట్టణంలోని ఎంపీ నివాసంలో బుధవారం ఆమెను కలిసి కొండ అభివృద్ధికి అదనంగా కొన్ని మౌలిక సౌకర్యాలు కల్పించాలని కోరారు. దీనికి స్పందించిన ఎంపీ సత్యవతి మాట్లాడుతూ అన్ని మౌలిక వసతులతో డిసెంబర్ నాటికి బొజ్జన్నకొండను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారని నాగభూషణం పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం రూ.7.2 కోట్లు, రాష్ట్రం నుంచి రూ.8 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభించినట్లు తెలిపారు. అసోసియేషన్ ఉపాధ్యక్షుడు వినకోట నీలేశ్ గుప్తా, మోహన్, రొబ్బి మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలతో ప్రజారోగ్యానికి భరోసా

- మున్సిపల్ కమిషనర్ వీరయ్య
- సోమలింగపాలెంలో వైద్య శిబిరం


సోమలింగపాలెంలో వైద్య శిబిరం పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ వీరయ్య

యలమంచిలి : వైద్య శిబిరాల ద్వారా ప్రజారోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని మున్సిపల్ కమిషనర్ వీరయ్య అన్నారు. బుధవారం యలమంచిలి మున్సిపాలిటీ పరిధి సోమలింగపాలెం గ్రామంలో ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్య శిబిరంను ఆయన సందర్శించి అక్కడి వైద్య సేవలు, రోగులకు ఇచ్చే మందులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవల కోసం ఫ్యామిలీ ఫిజిషియన్ అందుబాటులోకి తీసుకువచ్చిందని, గ్రామాల్లో ఫీవర్ సర్వే ద్వారా ఎప్పటికప్పుడు ప్రజలకు వ్యాధుల పట్ల అవగాహన కల్పిస్తున్నారని అన్నారు. ఈ ఉచిత వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. వర్షాకాలంలో వ్యాధుల నివారణకు ప్రతి ఒక్కరూ పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలని, కాలువలు శుభ్రంగా ఉంచుకోవాలని, దోమల బారిన పడకుండా జాగ్రత్తలు వహించాలని కోరారు.

పేటలో మాకే టికెట్ ఇవ్వాలి

> ఉద్దండపురం సభలో
> జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివశంకర్

నక్కపల్లి : రానున్న ఎన్నికల్లో పాయకరావుపేట నియోజకవర్గంలో పోటీ చేద్దామని ఆశిస్తున్న టీడీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వంగలపూడి అనిత ఆశలపై జనసేన పార్టీ నాయకులు నీళ్లు చల్లుతున్నారు. ఈ దఫా పాయకరావుపేటలో జనసేన పార్టీకే టికెట్ కేటాయించాలని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మిరెడ్డి శివశంకర్ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని ఉద్దండపురం మాజీ సర్పంచ్, బీజేపీ నాయకుడు పేకేటి రాజారావు జనసేన పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి జనసేన పార్టీ రాష్ట్ర నాయకులు తమ్మిరెడ్డి శివశంకర్, బొలిశెట్టి సత్య, సుందరపు విజయ్‌కుమార్, గడసాల అప్పారావు, గెడ్డం బుజ్జి హాజరయ్యారు. ఈ సందర్భంగా శివశంకర్ తదితరులు మాట్లాడుతూ రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో పాయకరావుపేట నియోజకవర్గంలో జనసేన జెండా ఎగరాలన్నారు. తమను కాదని టీడీపీ అనితకు టికెట్ ఇస్తే ఓడిస్తామని స్పష్టం చేశారు. గడచిన రెండు నెలల వ్యవధిలో మూడు బహిరంగ సమావేశాలు ఏర్పాటు చేసి ఇక్కడ తమ పార్టీకే టిక్కెట్ కేటాయించాలని జనసేన నాయకులు స్పష్టం చేస్తున్నారు. దీంతో టీడీపీలో కలవరం మొదలైంది.

9న బీసీ సంఘాల నేతలతో సమావేశం


రాష్ట్ర కమిటీ ఇన్‌చార్జిగా నియామక పత్రం అందుకుంటున్న ఆడారి కుమారస్వామి

తుమ్మపాల : రాష్ట్రంలో అన్ని బీసీ సంఘాల ముఖ్య నేతలతో ఈ నెల 9న పట్టణంలోని విజయ రెసిడెన్సీలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు ఆలిండియా బీసీ అసోషియేషన్ జాతీయ అధ్యక్షుడు పోతల ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ సంఘాల నాయకులు, ఉద్యమకర్తలు, కుల సంఘాల నాయకులు, మేధావులతో జరిగే సమావేశంలో బీసీ వర్గాలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ అసోషియేషన్ రాష్ట్ర కమిటీ ఏర్పాటులో భాగంగా రాష్ట్ర ఇన్‌చార్జిగా ఆడారి కుమారస్వామిని నియమించామన్నారు. బీసీలతో సత్సంబంధాలు కలిగిన నాయకుల పనితీరు ఆధారంగా త్వరలో అధ్యక్షుడిని ఎంపిక చేస్తామన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ శ్రేణులు


ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ శ్రేణులు, చిత్రంలో బొడ్డేడ ప్రసాద్

మునగపాక : వైఎస్సార్‌సీపీ బలోపేతమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఎమ్మెల్యే యూవీ రమణమూర్తిరాజు కోరారు. మండలంలోని గొల్లలపాలేనికి చెందిన పలువురు టీడీపీ కార్యకర్తలు మండల పార్టీ మహిళా అధ్యక్షురాలు శీరా రమణమ్మ ఆధ్వర్యంలో బుధవారం ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న సంక్షేమం, అభివృద్ధికి ఎంతో మంది ఆకర్షితులై పార్టీలో చేరడం శుభ పరిణామమన్నారు. పార్టీలో చేరిన వారిలో మొల్లి సింహాచలం, మొల్లి కృష్ణ, కామరాజు, అప్పలనాయుడు, వెంకునాయుడు, రాము, లక్ష్మణ, అప్పలరాజు తదితరులున్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జెడ్పీటీసీ స్వామి సత్యనారాయణ, సచివాలయాల మండల కన్వీనర్ పొలిమేర గణేష్‌లు పాల్గొన్నారు.

కుక్కలకు ఉచిత రేబిస్ నివారణ టీకాలు నేడు

అనకాపల్లి రూరల్ : ప్రపంచ జూనోసిస్ డేను పురస్కరించుకుని గురువారం స్థానిక గాంధీనగరం ప్రాంతీయ పశువుల ఆసుపత్రిలో పెంపుడు కుక్కలకు రేబిస్ నివారణ టీకాలు ఉచితంగా వేయనున్నట్టు పశుసంవర్ధక శాఖ ఏడీ బి. సౌజన్య తెలిపారు. జంతువుల ద్వారా రేబిస్, ఆంత్రాక్స్, బ్రూసెల్లోసిస్, లాప్టోస్పైరిస్ లాంటి ప్రాణాంతక వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ప్రధానంగా మనుషులకు రేబిస్ వ్యాధి ఎక్కువగా వ్యాపిస్తుందన్నారు. టీకా ద్వారా దీనిని అదుపులో పెట్టవచ్చన్నారు. స్థానిక గాంధీనగరం ఏరియా పశు వైద్యశాలతో పాటు జిల్లాలో ఉన్న పశు వైద్యశాలల్లో కూడా జూనోసిస్ డేను పురస్కరించుకుని గురువారం కుక్కలకు ఉచితంగా రేబిస్ నివారణ టీకాలు వేస్తున్నందున అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.